# 'పసి జ్ఞాపకం'

కొన్నికొన్ని అల్పమైనవిగా అనిపించేవి కాలక్రమంలో కనుమరుగై, ఎప్పుడో ఒకప్పుడు మనకు కనిపించి, మన జీవితంలో గతించిపోయిన మహాద్భుతమూ అత్యంత మధురమూ అయిన కాలాన్ని చుట్ట చుట్టి తెచ్చి మన కళ్లముందు పరచి చూపిస్తాయి.

అప్పుడు గతించిపోయిన ఆ మధురమైన కాలాన్ని తలచుకుని విషాదం చెందడం మనకు సహజం.

మొన్నామధ్య ఓ వివాహానికి తెనాలి వెళ్లాల్సి వచ్చింది. మేము కర్నూలు నించీ తెనాలి వెళ్లాలంటే రోడ్డు ద్వారా ఖచ్చితంగా నల్లమల్ల అడవిని దాటి వెళ్లాల్సిందే.

మా కృష్ణమోహనుడి కారులో అతనూ నేనూ బయల్దేరాం. ఆత్మకూరు నించి అడవి మొదలవుతుంది. నల్లమల అడవులు గురించి నేను ప్రత్యేకం చెప్పనవసరంలేదు. దట్టమైన చీకటి అడవి చిరుతలూ, పెద్ద పులులూ ఇతర జంతువులకూ అభయారణ్యం.

రోడ్డు సమసిపోయి యుగాలైంది, విజయవాడ కర్నూలు హైవే కొన్నేళ్లుగా వేస్తూనే ఉన్నారు. దారిపొడుగునా కూలీలు రోడ్డు పనిచేస్తూనే ఉన్నారు. రోలర్లూ, డాంబారు డ్రమ్ములూ, మిక్సర్లూ, రోడ్డు పక్కన కంకర గుట్టలూ హైవే నిర్మాణానికి సాక్షులుగా దర్శనమిస్తూనే ఉన్నాయి.

కొంత ప్రయాణం తర్వాత చిక్కటి అడవిలోకి ప్రవేశించాం. రోడ్డు ఏదో ఆకుపచ్చటి గుహలోకి వెళ్తున్న అనుభూతి. పైన ఆకాశం కనిపించదు. ఏదో తెలియని పచ్చి పరిమళం. దారికడ్డంగా పరుగులెత్తే కోతిమూకలు.

కాంక్రీటు అడువుల్లో, ఆకుపచ్చదనాన్ని చిన్నచిన్న కుంపట్లల్లో మాత్రమే చూసుకునే దౌర్భాగ్యం పట్టిన మనసులకు ఆ నిజప్రకృతి దర్శనం ఓ మరుగుజ్జుదనాన్నిస్తున్న భావన కలగడం సహజం.

కృష్ణమోహనుడు కారును చిక్కటి అడవి మధ్యలో ఆపించాడు. నాకు తెల్సు ఆ ప్రకృతి ఒడిలో మా కృష్ణమోహనుడు గుడి కట్టబోతున్నాడని, ఆ గుడి 'బ్యాకస్' గుడి (గ్రీకు పురాణాల్లో Bacchus మద్యానికధి దేవత). రోడ్డు దిగి పచ్చటి తివాచీలాంటి గడ్డి మీద కూచున్నాం. రోడ్డుకటువేపున రోడ్డువ వేస్తూన్న కూలీలు పని ఆపి తెచ్చుకున్న సద్దులు విప్పి

వాటి చుట్టూ గుండ్రంగా కూచుని అన్నాలు తింటున్నారు. అంతవరకూ వాళ్లు పడ్డ శ్రమ తొలగిపోడం ప్రస్ఫుటంగా కనబడుతోంది. వాళ్లు రోడ్డుకిటువేపునున్న మమ్మల్ని చూస్తూ నవ్వుతూ మాట్లాడుకుంటూ భోజనాలు చేశారు. (భోజనాలంటే భక్ష్య, భోజ్య,లేహ్య, చోష్య, పానీయాలనుకుంటే అది పాతకం) అన్నమూ మరో వ్యంజనమూ ప్లాస్టిక్ బిందెలో నీళ్లూ, అదీ వాళ్ల భోజనం.

సరే భోజనం అయ్యింతర్వాత వాళ్లలో ఓ ముప్పై ఏళ్ల యువకుడు రోడ్డుదాటి మాదగ్గరికొచ్చి "సార్ ఓ సిగరెట్టీ సాఁ" అన్నాడు.

మా కృష్ణమోహనుడు మామూలేగానే దాతృత్వమెక్కువ వున్నవాడూ, ఇక పూజ చేస్తున్నాడా సరేసరి బలి శిబి కర్ణాదులు బలాదూర్... సిగరెట్ అడిగిన అతనికి ఓ నాలుగు సిగరెట్లు మిగులున్న పెట్టె యిచ్చేశాడు.

కృతజ్ఞతలు మాటల ద్వారా చెప్పడం తెలియని గ్రామీణ నైర్మల్యం ఆ కూలీది. రోడ్డు దాటి ఆ సిగరెట్ పెట్టె వాళ్లకిచ్చి, రోడ్డు దిగి అడవిలో కల్సిపోయాడు.

ఓ పదినిముషాల్తర్వాత పొదల్లోంచీ బైటికొచ్చాడు. అతడి చేతిలో ఆకుల్లో చుట్ట చుట్టబడి ఏమో ఉన్నాయి. సరాసరి మా దగ్గరికొచ్చి ఆ ఆకుల చుట్ట మా చేతుల్లో పెట్టి "ఉప్పు తెచ్చిస్తా నంచుకొని తినండి సా" అని వెళ్లి వాళ్ల దగ్గరున్న ఉప్పు గుప్పెట్లో పెట్టుకుని తెచ్చిచ్చి, ఓ అద్భుత హాసాన్ని మా మీదకు విసిరి వెళ్లిపోయాడు.

ఆ ఆకుల్లో వున్నవి చిటిముటి పళ్లు. నేరేళ్లూ, వాటిని చూడగానే ఒక్కసారి నా బాల్యం నా కళ్లముందు ప్రత్యక్షమయ్యింది. ఆ పళ్లమ్మే ముసలవ్వా, కుంటి వెంకటీ... అయ్యో! ఎక్కడి కెళ్లిపోయాయివన్నీ. ఎంత మహాద్భుత దృశ్యాలు! చిటిముటి పళ్లు పెంకు పగులగొట్టి లోపలి గుజ్జును బొటనవేలుతో గోకి, ఆ బొటనవేలిని సొంతం నోట్లో పెట్టుకు చీకిన ఆ రోజులు! ఆ పసితనం! ఆ ఆనందం...!

నేరేళ్లు నమిలి నీలమైన నాలుక వెళ్లబెట్టి 'ఆఁ' అని చూపుతూ ఆడుకున్న బాల్యం! ఎంత మధురమైనవి ఆ రోజులు!

ఆ అడవిలోంచీ ఆ పళ్లు తెచ్చిచ్చిన కూలీ ఆ అడవంత పవిత్రంగా కనిపించాడు. మరచిన బాల్యాన్ని గుర్తుకు తెచ్చినందుకతనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ●